క్లుప్తంగా

రైతులకు రూ.1.12కోట్ల రుణాల పంపిణీ



కొల్లికుళ్ల(పెనుగంచిప్రోలు): రైతులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులు కోనంగి ముక్కంటి సూచించారు. సంఘ పరిధిలోని 12 మంది రైతులకు దీర్ఘకాలిక రుణాల కింద రూ.1.12కోట్లను బుధవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించడం ద్వారా రుణ పరపతిని మరింత పెంచుకోవాలని సూచించారు. సంఘ కార్యదర్శి గడ్డం గోపాలరావు, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్‌కు మరమ్మతులు

కంచికచర్ల : జగనన్న కాలనీ లేఅవుట్లలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని సర్పంచి బొక్కా రవికుమార్ తెలిపారు. మండలంలోని గండేపల్లి జగనన్న లే అవుట్‌కాలనీలో మరమ్మతులకు గురైన విద్యుత్ మోటార్‌ను బుధవారం మరమ్మతులు చేయించారు. సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ జగనన్న కాలనీ లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణానికి అవసరమైన నీరు, విద్యుత్ సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. లబ్ధిదారులంతా త్వరితగతిన ఇళ్లనిర్మాణాన్ని పూర్తిచేసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, జిల్లేపల్లి రత్నాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

మిరప తోటల పరిశీలన



నందిగామ: ఉద్యానవన శాఖ జిల్లా అధికారి పి.బాలాజీకుమార్ మండలంలోని రామిరెడ్డిపల్లి, జొన్నలగడ్డ గ్రామాల్లో సాగవుతున్న మిరప పంటలను బుధవారం పరిశీలించారు. పంట పొలాల్లో బెట్ట పరిస్థితులను గమనించిన అధికారులు పరిస్థితిని అధిగమించేందుకు రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట స్థానిక ఉద్యానవన శాఖ అధికారి నీలిమ, సిబ్బంది ఉన్నారు.

సచివాలయ సిబ్బందికి అవగాహన



పెనుగంచిప్రోలు:స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం పౌర సమాజం ఐక్యసేవా సంఘం వ్యవస్థాపకులు కూరగంటి హనుమంతరావు, నియోజకవర్గ కన్వీనర్ తోటపల్లి సురేష్‌కుమార్ సమాచార హక్కు చట్టంపై సచివాలయ గ్రేడ్-5, 6 కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవోనంబరు 437తో గ్రామ సచివాలయాలు సమాచార హక్కు చట్టం పరిధిలోకి వచ్చాయన్నారు. గ్రేడ్-5, 6 కార్యదర్శులు పౌర సమాచార అధికారులుగా, డిజిటల్ అసిస్టెంట్లు సహాయ పౌర సమాచార అధికారులుగా పరిగణిస్తారని వివరించారు. సమాచార హక్కు చట్టంపై అందరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సిద్దారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ ఇన్‌చార్జి బాధ్యతల స్వీకారం

తిరుమలగిరి (జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకుద్భవ వెంకటేశ్వరస్వామి ఆలయ ఇన్‌చార్జి ఏసీగా నెమలి వేణుగోపాలస్వామి ఆలయ ఏసీ దాసరి శ్రీరామ వరప్రసాదరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ ఇన్‌చార్జి ఏసీగా వేదాద్రి యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈవో జయప్రకాష్ పనిచేస్తుండగా, ఆయన నుంచి వరప్రసాదరావు బాధ్యతలు స్వీకరించారు.

ఆయుర్వేదంపై అవగాహన ర్యాలీ



అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు):ఈనెల పదోతేదీన ఆయుర్వేద పితామహుడు ధన్వంతరి జయంతిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న జాతీయ ఆయుర్వేద దినోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం అనిగండ్లపాడు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆయుర్వేద వైద్యంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి వై.రత్నప్రియదర్శిని మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. మనచుట్టూ అందుబాటులో ఉంటే మొక్కలతో చక్కటి ఆరోగ్యాన్ని పొందవచ్చని తెలిపారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేసిన మంచి ప్రజలకు చెప్పాలి



ముప్పాళ్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్



దెబ్బతిన్న లోలెవల్ కాజ్‌వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ అరుణ్‌కుమార్

ఎమ్మెల్సీ డాక్టర్ అరుణ్‌కుమార్

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజల కోసం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పనులను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. నందిగామ పట్టణంలోని 9, 10వార్డుల పరిధిలోని ఐదో సచివాలయం, మండలంలోని ఐతవరం, కంచల, చందర్లపాడు మండలంలోని ముప్పాళ్ల, మునగాలపల్లి గ్రామ సచివాలయాల పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమ నిర్వహణకు సంబంధించి ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్‌లు, సచివాలయ కన్వీనర్లతో బుధవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమాన్ని గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని సచివాలయాల పరిధిలో జరిగే వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు, వలంటీర్‌లు విధిగా పాల్గొని విజయవంతం చేయాలని అరుణ్‌కుమార్ కోరారు. గత ప్రభుత్వాలకు భిన్నంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నారని గుర్తుచేశారు. గ్రామాల్లో ఇప్పటికే సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, జగనన్న పాల వెల్లువ, సీసీ రోడ్లు, డ్రైన్‌లు తదితర అభివృద్ధి పనులను చేపట్టినట్లు వివరించారు. ఆయా పథకాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రూ. రెండు లక్షల కోట్లకు పైగా నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు చెల్లించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఇది దేశచరిత్రలోనే ఓ మైలురాయి అని పేర్కొన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను సైతం యుద్ధప్రాతిపదికన పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ పాకలపాటి కిరణ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, కందుల నాగేశ్వరరావు, వెలగపూడి వెంకటేశ్వరరావు, బుగ్గినేని సురేష్, బొల్లినేని శ్రీనివాసరావు, గుడివాడ సాంబశివరావు, చిరుమామిళ్ల చైతన్యకుమార్, కోలేటి నాగరాణి, విశ్వనాధపల్లి కృపారావు, చలమల మధు, రామిరెడ్డి సీతయ్య, షేక్ మీరా, వలంటీర్‌లు పాల్గొన్నారు.

దెబ్బతిన్న కాజ్‌వే పరిశీలన...

నందిగామ టౌన్: అడవిరావులపాడు సమీపంలోని నల్లవాగుపై దెబ్బతిన్న లోలెవల్ కాజ్‌వేకు యుద్ధప్రాతిపదికన మర్మమతులు చేపడతామని ఎమ్మెల్సీ డాక్టర్ అరుణ్‌కుమార్ తెలిపారు. ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి బుధవారం ఆయన నల్లవాగుపై ఉన్న లోలెవల్ కాజ్‌వే బ్రిడ్జిని పరిశీలించారు. ఆర్అండ్‌బీ సీఈ శ్రీనివాస్‌రెడ్డిని ఫోన్‌ద్వారా సంప్రదించి, సమస్యను వివరించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా వెంటనే పనులు చేపడతామన్నారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి ఇబ్బందులు తలెత్తకుండా శాశ్వత పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. అంచనాలు రూపొందించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తానని వివరించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఏఈ నరేంద్ర, వైస్ ఎంపీపీ ఆకుల హనుమంతరావు, వ్యవసాయాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బొల్లినేని శ్రీనివాసరావు, పారుపల్లి హరిబాబు, నెలకుదిటి శివనాగేశ్వరరావు, సూరా కొండ, గుంటుపల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం



ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని వివరించేందుకు గురువారం నుంచి జగ్గయ్యపేట నియోజకవర్గంలో చేపడుతున్న వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. జగ్గయ్యపేట పట్టణంలోని 15వ సచివాలయ పరిధిలోగల తొర్రగుంటపాలెం, వత్సవాయి మండలంలోని మక్కపేట, పెనుగంచిప్రోలు మండలంలోని వెంకటాపురం గ్రామ సచివాలయాలలో నిర్వహించే ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. వై ఏపీ నీడ్ జగన్ కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డులు, వైఎస్సార్‌సీపీ జెండాల ఆవిష్కరణ, ఇంటింటికీ తిరిగి ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి అనే అంశంపై ప్రజలకు వివరిస్తామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల ప్రతినిధులు హాజరుకావాలని ఉదయభాను కోరారు.

జగ్గయ్యపేట మండలంలో...

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలో ఈనెల పదోతేదీ నుంచి 23వతేదీ వరకు పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమేష్‌బాబు తెలిపారు. 10న పోచంపల్లి, 14న బండిపాలెం, 15న వేదాద్రి, 16నజయంతిపురం, 17న కే అగ్రహారం, 20న ముత్యాల, 21న బూదవాడ, 22న అన్నవరం, 23న బలుసుపాడు గ్రామాల్లో పల్లెకు పోదాం కార్యక్రమం ఆయా గ్రామ కార్యదర్శుల పర్యవేక్షణలో నిర్వహిస్తారని వివరించారు. ప్రతి వలంటీర్ పరిధిలోని అన్ని గృహాలను సందర్శించి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలు పొందిన లబ్ధిని వివరించాలని సూచించారు.

నందిగామలో..

నందిగామ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లెకు పోదాం కార్యక్రమం నందిగామ మున్సిపాలిటీ పరిధిలో గురువారం నుంచి ప్రారంభమవుతుందని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23వ తేదీ వరకు ప్రతిరోజు మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఆయా వార్డు సచివాలయాల్లో నిర్వహించే ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

బాణసంచా షాపులకు అనుమతి తప్పనిసరి



ఎస్ఐ సుబ్రహ్మణ్యం

కంచికచర్ల : దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేసుకునేవారు తప్పనిసరిగా అనుమతులు పొందాలని ఎస్ఐ పెంకె సత్య వెంకట సుబ్రహ్మణ్యం బుధవారం ఆదేశించారు. అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతులు లేకుండా బాణసంచా విక్రయించినా, లేక నిల్వ చేసినా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అగ్నిప్రమాదాలు చోటుచేసుకోకుండా దుకాణాల వద్ద నీరు, పొడి ఇసుక సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. నివాసాలు, విద్యా సంస్థలు, ఆసుపత్రులకు దూరంగా షాపులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా గ్రామాల్లో బాణాసంచా విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. టపాసులు కాల్చే సమయంలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే 100, 101, 112 లేదా పోలీస్‌స్టేషన్ ఫోన్ నెంబర్ 08678 274333, ఫైర్ స్టేషన్ నంబర్ 08678 274444 సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సూచించారు.

విద్యుత్‌శాఖ విస్తృత తనిఖీలు

నందిగామ(చందర్లపాడు): విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని ఆ శాఖ విజిలెన్స్ ఈఈ కమల కుమారి పేర్కొన్నారు. విద్యుత్ శాఖ అధికారులు బుధవారం చందర్లపాడు మండలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మొత్తం 40 బృందాలుగా ఏర్పడి మండలంలోని పలు గ్రామాల్లో 2,823 విద్యుత్ సర్వీస్‌లను తనిఖీ చేశారు. ఆ సమయంలో అధికంగా విద్యుత్ లోడ్ వినియోగిస్తున్న 260మంది పై కేసు నమోదు చేసి వారికి రూ 6.30లక్షలు జరిమానా విధించారు. అదేవిధంగా విద్యుత్ చౌర్యానికి సంబంధించి ఆరుగురుపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారులు మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు మీటర్‌పై వినియోగిస్తున్న లోడ్‌ను తప్పనిసరిగా అధికారులకు తెలియజేయాలని, సకాలంలో విద్యుత్ బిల్లులను చెల్లించాలని సూచించారు. ఈ తనిఖీల్లో విజయవాడ రూరల్ ఈఈ శ్రీనివాసరావు, పెద్దసంఖ్యలో సిబ్బంది పాల్గొన్నారు.



చందర్లపాడులో విద్యుత్ వినియోగదారులతో మాట్లాడుతున్న అధికారులు

'పల్లెకు పోదాం'ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రమేష్‌బాబు

వత్సవాయి:మండలంలో గురువారం నుంచి పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.రమేష్‌బాబు తెలిపారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాయలయంలో బుధవారం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పల్లెకు పోదాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. 9వతేదీన మక్కపేట, 10న భీమవరం-1, 14న భీమవరం-2, 15నగోపినేనిపాలెం, 16న పెద్దమోదుగపల్లి, 17న మంగొల్లు-1, 20న మంగొల్లు-2, 21న ఇందుగపల్లి, 22న కన్నెవీడు, 23న చిట్యేల సచివాలయాల పరిధిలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. అధికారులంతా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు యేశపోగు దేవమణి, తహశీల్దార్ పి.వైకుంఠరావు, ఏవో బి.రాజు, వైద్యాధికారిణి సుష్మాప్రియదర్శిని, ఈవోపీఆర్డీ మాధవి, పీఆర్ ఏఈ సుందరరామయ్య, ఈవో షేక్ ఇమామ్‌సాహెబ్ పాల్గొన్నారు.

'పల్లెకు పోదాం'పై సమీక్ష

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేటలో గురువారం నుంచి జరగనున్న పల్లెకు పోదాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు కోరారు. మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పురపాలకసంఘ పరిధిలో ఉన్న 15వ సచివాలయంలో ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో వార్డు వలంటీర్లు, సచివాలయ కార్యదర్శులు, సచివాలయాలకు నియమింపబడిన నోడల్ అధికారుల పాల్గొని ప్రతి లబ్ధిదారుని ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల వివరాలను తెలియజేస్తారని తెలిపారు. 10వతేదీన రైల్వే వ్యాగిన్ రోడ్, 14న సీతారామపురం, 15న మీసేవ బిల్డింగ్, 16న తేదీన సీతారామపురం, 17న ఎన్ఎస్‌పీ క్వార్టర్స్, 20న డీవీఆర్ నగర్, 2న కాకానినగర్, 22న ఆర్టీసీ కాలనీ, 23న కొలిమిబజారులో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

కందకంలో పడిన ట్రాక్టర్



పెద్దాపురం(వీరులపాడు):కర్ర లోడుతో వస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి కందకంలో పడటంతో ఓ వ్యక్తికి గాయాలైన ఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. మండలంలోని పెద్దాపురంలో ఉన్న అడితికి వేప కర్ర లోడుతో వస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి కందకంలో పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అదేసమయంలో ఆమార్గంలో పయనిస్తున్న వాహనచోదకులు స్పందించి డ్రైవర్‌కు సపర్యలు చేయడంతోపాటు రోడ్డుపై పడిన వేపకర్రను తొలగించారు.

పుట్టగొడుగుల పెంపకంపై అవగాహన



పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణకు హాజరైన కిశోర బాలికలు

మక్కపేట(వత్సవాయి : మండలంలోని మక్కపేటలో గరికపాడు కేఎల్ రావు కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ ఎస్.కృష్ణంరాజు నేతృత్వంలో బుధవారం కిశోరబాలికలకు పుట్టగొడుగుల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.ప్రభావతి మాట్లాడుతూ పుట్టగొడుగుల్లో అత్యధిక పోషక విలువలు ఉన్నాయని వివరించారు. పుట్టగొడుగుల పెంపకం ద్వారా గ్రామీణ మహిళలు, యువతకు చక్కటి స్వయం ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. పుట్టగొడుగులు పెంపకం, మెలకువలు, వ్యాధుల నివారణ గురించి వివరించారు. 100మంది కిశోరబాలికలు ఈ కార్యక్రమానికి హాజరై పుట్టగొడుగుల పెంపకంలో భాగంగా గడ్డిని ముక్కలుగా చేయడం, నానబెట్టడం వంటి పనులు నేర్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడేటి శారమ్మ, ఐసీడీఎస్ అసిస్టెంట్ సీడీపీవో నాగమణి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కంభంపాటి సేవలు వెలకట్టలేనివి



ఆవిష్కరించిన కంభంపాటి వెంకయ్య, నారాయణమ్మ దంపతుల విగ్రహాలు

నూజివీడు: పల్లెర్లమూడి గాంధీగా పేరుగాంచిన దివంగత మాజీ సర్పంచ్ కంభంపాటి వెంకయ్య, నారాయణమ్మ దంపతుల విగ్రహాల ప్రతిష్ట బుధవారం గ్రామంలో నిర్వహించారు. ప్రతిష్ఠించిన విగ్రహాలను స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డు మాజీ సభ్యుడు తుమ్మల రమేష్ చంద్రబోస్, కంభంపాటి గోవర్ధన్‌రావు, కంభంపాటి శ్రీమన్నారాయణ, కంభంపాటి రవికుమార్, నందమూరి శోభారాణి, విశ్వేశ్వర దంపతులు, కంభంపాటి రాజా, లింగం రాణి దంపతులు, కొడాలి ప్రమీలా రాణి దంపతులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కంభంపాటి వెంకయ్య పల్లెర్లమూడి గ్రామాభివృద్ధికి చేసిన సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. గ్రామ పెద్దలు యనమదుల దాసు, అట్లూరి చారిటబుల్ ట్రస్ట్ అధినేత అట్లూరి రమేష్, ఆళ్ల గోపాలకృష్ణ, ఉప్పలపాటి శ్రీనివాసరావు, కంభంపాటి రమేష్ పాల్గొన్నారు.

లకిరెడ్డి బాలిరెడ్డికి ఘన నివాళి



వెల్వడంలో బాలిరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న వెంకటేశ్వరరెడ్డి

వెల్వడం(మైలవరం): లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వ్యవస్థాపక చైర్మన్ దివంగత లకిరెడ్డి బాలిరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని వెల్వడంలో బుధవారం నిర్వహించారు. వెల్వడం సెంటర్‌లోని లకిరెడ్డి బాలిరెడ్డి కాంస్య విగ్రహానికి లకిరెడ్డి సోదరులు గజమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన సభా కార్యక్రమం నిర్వహించారు. వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ దివంగత నాయకులు బాలిరెడ్డి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో లకిరెడ్డి పరమేశ్వరీదేవి, ఎల్‌బీఆర్‌సీఈ ట్రస్టు మాజీ చైర్మన్ సచ్చిదానందం, ట్రస్టు అధ్యక్షుడు జీ. శ్రీనివాసరెడ్డి, ఎల్‌బీఆర్‌సీఈ ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు, పీ గోపాల్, గ్రామ సర్పంచ్ ధర్మరాజు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు యరమల నరసింహారెడ్డి, యరమల శంకరరెడ్డి, కేడీసీసీ బ్యాంక్ ప్రెసిడెంట్ తోట తిరుపతిరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి రామకోటిలో ప్రత్యేక కార్యక్రమాలు



భారతీ తీర్థ మహాస్వామి సన్యాసాశ్రమ స్వీకార మహోత్సవాలు బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

విజయవాడ కల్చరల్: భారతీయ ఆధ్యాత్మిక ప్రపంచంలో తనదైన ముద్ర వేసుకున్న జగద్గురువులు శృంగేరీ పీఠాధిపతులు భారతీ తీర్థ మహాస్వామి సన్యాసాశ్రమం స్వీకరించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు 10 వ తేదీ నుంచి డిసెంబరు 29వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు శివరామకృష్ణ క్షేత్రం ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ తెలిపారు. రామకోటిలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. గురుపరంపరలో సాగే పీఠంలో అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వేదికగా నిలుస్తుందన్నారు. ఉత్తరాధికారి విదుశేఖర భారతి ఆశీస్సులతో ప్రతిరోజూ జగదుర్గువుల వైభవం అంశంగా ప్రసంగాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 10 నుంచి 19 వ తేది వరకు శంకర విజయం అంశంగా ఆచార్య శలాక రఘునాథ శర్మ, 20 నుంచి 26 వరకు సురేశ్వరాచార్య మహాస్వామి అంశంగా విశ్వనాథ గోపాల కృష్ణశాస్త్రి, 27 నుంచి 30వ తేదీ వరకు విద్యారణ్య మహాస్వామి అంశంగా ముదిగొండ శంకరయ్య, డిసెంబరు ఒకటో తేదీ నుంచి 5 వ తేదీ వరకు సచ్చిదానంద నృసింహ భారతీ స్వామి వైభవం అంశంగా తంగిరాల రాజేంద్ర ప్రసాద్ శర్మ, 6 నుంచి 12 వ తేదీ వరకు చంద్రశేఖర భారతీ స్వామి అంశంగా పురాణం మహేశ్వరస్వామి వైభవం, 13 వ తేదీ నుంచి 19వ తేదీ వరకు విద్యాతీర్థ మహాస్వామి అంశంగా 20వ తేదీ నుంచి 29 వ తేదీ వరకు భారతీ తీర్థ స్వామి అంశంగా ఆధ్యాతిక ప్రసంగాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వేద పండితులు వీరుభొట్ల ఫణిశర్మ మాట్లాడుతూ 50 రోజులపాటు నిత్యం పరమేశ్వరునకు అభిషేకాలు, రుద్రపారాయణం, జరుగుతుందని తెలిపారు. సమావేశంలో గండూరి చంద్రమౌళీశ్వర శర్మ పాల్గొన్నారు.

పురస్కారాల కోసం దరఖాస్తు చేసుకోండి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ (సాహిత్య, సామాజిక, సాంస్కృతిక సేవా సంస్థ), హైదరాబాద్ వారి 18వ వార్షికోత్సవాల్లో భాగంగా విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న అధ్యాపకులు, ఉపాధ్యాయులను గుర్తించి అక్షరబ్రహ్మ, సేవాబ్రహ్మ పురస్కారాలతో సత్కరించనున్నట్లు అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ ఇ.ఎస్.ఎస్. నారాయణ మాస్టారు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులకు అక్షర బ్రహ్మ, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ పురస్కారంతో సత్కరిస్తామన్నారు. వృద్ధులు, అనాథలు, దివ్యాంగులకు సేవలందిస్తున్న సమాజ సేవకులకు 'సేవా బ్రహ్మ' పురస్కారంతో సన్మానిస్తామన్నారు. ఆసక్తి, అర్హతగలవారు ఆయా వివరాలను ఈ నెల 25వ తేదీలోగా ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, డోర్ నెం. 1-20-164, గోకుల్ నగర్, వెంకటాపురం, పోస్టు, తిరుమలగిరి, సికింద్రాబాద్-15 అడ్రస్‌నకు పంపించాలని కోరారు. మరింత సమాచారం కోసం 96523 47207కు ఫోన్ చేయాలని కోరారు.

సీఐడీ ఆఫీసులో ఉద్యోగం పేరుతో మోసం

పాయకాపురం(విజయవాడరూరల్): సీఐడీ ఆఫీసులో ఉద్యోగం పేరుతో నమ్మించి ఓ వ్యక్తి నుంచి పెద్ద మొత్తంలో డబ్బు కాజేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితుడు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కండ్రిక బోస్‌నగర్‌కు చెందిన మోక సువర్ణరాజు డిగ్రీ చదివి ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. ఈ క్రమంలో చిన్నప్పటి స్నేహితుడైన వాంబేకాలనీకి చెందిన రవికుమార్ ఓ పెళ్లిలో కలిశాడు. తాను సీఐడీ ఆఫీసులో అకౌంటెంటుగా పనిచేస్తున్నానని రవికుమార్ చెప్పాడు. ఉద్యోగం ఇప్పిస్తానని సువర్ణరాజును నమ్మించాడు. పలు దఫాలుగా సువర్ణరాజు నుంచి రూ.12 లక్షలు రవికుమార్ తీసుకున్నాడు. ఎంతకీ ఉద్యోగం రాకపోవడంతో డబ్బులు కోసం రవికుమార్‌ను ఒత్తిడి చేశాడు. ఈ నేపథ్యంలో సీఐడీ ఆఫీసులో ఎగ్జిక్యూటివ్‌గా ఉద్యోగం వచ్చిందని నమ్మబలికాడు. 2022 జూన్ 30వ తేదీలోగా జాయిన్ కావాలని సువర్ణరాజుకు వాట్సాప్‌లో అపాయిమెంట్ లెటర్ పంపించాడు. ఆ లెటర్ తీసుకొని సువర్ణరాజు సీఐడీ ఆఫీసుకు వెళ్లాడు. అక్కడి అధికారులు ఆ లెటరు చూసి ఫేక్ అని చెప్పారు. దీంతో తాను మోసపోయానని గ్రహించి డబ్బులు కోసం రవికుమార్‌పై తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నాడు. రోజులు గడుస్తున్నా డబ్బులు ఇవ్వకపోవడంతో చేసేది లేక న్యాయం చేయాలని సువర్ణరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందజేత

ఆగిరిపల్లి: దివ్యాంగులకు కృత్రిమ అవయవాల అందజేతకు దాతలు ముందుకు రావాలని డాక్టర్ పిన్నమనేని సిద్దార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ సీవీ రావు కోరారు. మండలంలోని తోటపల్లిలోని హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో జీ అండ్ జే లక్ష్మీ హోమ్స్ ఎల్ఎల్‌పీ ఆర్థిక సాయంతో ఏలూరు జిల్లా ముదినేపల్లికి చెందిన మురాల కిరణ్‌కుమార్‌కు, గుడివాడకు చెందిన కేవీ నరసింహారావుకు, ఆగిరిపల్లి మండలం సూరవరానికి చెందిన జక్కుల మురళీకృష్ణకు, విజయవాడ కృష్ణలంకు చెందిన మద్దాల మహంకాళరావుకు, ప్రకాష్ నగర్‌కు చెందిన త్రిపురాన నారాయణరావుకు బుధవారం కృత్రిమ కాళ్లు అందజేశారు. విద్యుత్ శాఖ విశ్రాంత డీఈ యలమంచిలి బాబూరావు, సీనియర్ న్యాయవాది కలపాల వెంకటరమణ, కేసరపల్లి పొట్లూరి బసవారావు, హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి పాల్గొన్నారు.